



ఈవీఎంలను భద్రపరచిన మౌలానా అబుల్ కలాం ఉర్దూ యూనివర్శిటీ

స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు

- ఈవీఎంలకు మూడంచెల భద్రతా ఏర్పాట్లు
- 4వ తేదీన ఓట్ల లెక్కింపు



ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

కడప(కలెక్టరేట్), మే 14: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ ప్రక్రియ సోమవారం రాత్రికి పూర్తయింది. దాదాపు జిల్లాలో 16.39 లక్షల మంది ఓటర్లుండగా అందులో 13 లక్షలకు పైగా ఓటర్లు (79.57 శాతం) ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కడప పార్లమెంట్ స్థానంతో పాటు7 అసెంబ్లీ నియోజక వర్గాల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన సోమవారం అర్ధరాత్రి నుంచి కట్టుదిట్టమైన భద్రత నడుమ కడన నగర శివారులోని మౌలానా అబుల్ కలాం ఉర్దూ యూనివర్శిటీలో ఈవీఎంలను మూడంచెల భద్రత మధ్య స్ట్రాంగ్ రూముల్లో అధికారులు భద్రపరిచారు. మంగళవారం జిల్లా ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్ విజయరామరాజు, సాధారణ ఎన్నికల పరిశీలకుల సమక్షంలో జిల్లా ఎన్నికల ప్రత్యేక పర్యవేక్షకులు, కడప కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలసి ఈవీఎంలను భద్రతను పరిశీలించారు. జూన్ నెల 4వతేదీన జరిగే ఓటర్ల లెక్కింపులో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.




ఈవీఎంలను వాహనాల్లో తరలిస్తున్న దృశ్యం



జమ్మలమడుగు - ముద్దనూరు రోడ్డులో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కూడికలు, తీసివేతల్లో..
అభ్యర్థులు బిజీబిజీ

- పోలింగ్ కేంద్రాల వారీగా ఓటింగ్ సరళిపై ఆరా
- కేడర్‌తో చర్చలు
- మనకు మెజార్టీ ఎంత.. మైనస్ ఎంత.. అంటూ కాకిలెక్కలు
- పోలింగ్ తమకే అనుకూలం అంటూ ఎవరికి వారి అంచనా
- గెలుస్తామని ఎవరి ధీమా వారిదే



(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసింది. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. జూన్ 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఫలితాలకు మూడు వారాల సమయం ఉండడంతో అభ్యర్థులు గెలుపోటములపై అంచనా వేస్తున్నారు. సోమవారం రాత్రి వరకు కూడా పలుచోట్ల పోలింగ్ ఆలస్యంగా జరిగింది. ఇక మంగళవారం అభ్యర్థులంతా బిజీబిజీ అయిపోయారు. ఓటింగ్ ఎలా జరిగిందంటూ కార్యకర్తలతో మాట్లాడి పోలింగ్ సరళిపై అంచనాలు వేసుకుంటున్నారు. మనమే గెలుస్తామంటూ ఇరువురూ ధీమా వ్యక్తం చేసుకుంటున్నారు.

టీడీపీ, వైసీపీ మధ్య హోరాహోరీ సాగింది. కొన్నిచోట్ల కాంగ్రెస్ కూడా ఉనికిచాటుకుంది. ఎంపీ స్థానానికి మాత్రం మూడు పార్టీలు ఢీ అంటే ఢీ అనేలా తలపడ్డాయి. కడప పార్లమెంటు ఎన్నిక హై ఓల్టేజీగా మారింది. టీడీపీ నుంచి చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి పోటీ చేయగా, కాంగ్రెస్ నుంచి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ అవినాశ్‌రెడ్డి పోటీ చేశారు. దీంతో ఈ ఎన్నికలపై ఎనలేని హైప్ వచ్చినట్లయింది. ఇక కడప అసెంబ్లీకి టీడీపీ నుంచి ఆర్.మాధవీరెడ్డి, వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కాంగ్రెస్ నుంచి అఫ్జల్‌ఖాన్ పోటీ చేశారు. మైదుకూరుకు టీడీపీ నుంచి పుట్టా సుధాకర్‌యాదవ్, సిట్టింగ్ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ప్రొద్దుటూరుకు టీడీపీ నుంచి వరదరాజులరెడ్డి, వైసీపీ నుంచి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పోటీ చేశారు. అలాగే జమ్మలమడుగుకు బీజేపీ నుంచి ఆదినారాయణరెడ్డి, వైసీపీ నుంచి సుధీర్‌రెడ్డి, పులివెందుల నుంచి సీఎం జగన్, టీడీపీ నుంచి బీటెక్ రవి, కమలాపురంలో టీడీపీ నుంచి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, వైసీపీ నుంచి రవీంద్రనాథరెడ్డి, బద్వేలులో బీజేపీ నుంచి బొజ్జ రోశన్న, వైసీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి సుధ పోటీ చేశారు. నామినేషన్లు వేసిన దగ్గర నుంచి ఇరువర్గాలు ప్రచారం ముమ్మరంగా నిర్వహించగా ఎన్నికల రోజున పోల్ మేనేజ్‌మెంటు పోటీ పడి మరీ చేసుకున్నారు.

ఓట్లకోసం పోటెత్తారు

ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఈసారి ఓటర్లు ఉత్సాహం చూపించారు. ఉద్యోగ రీత్యా ఇతరప్రాంతాల్లో ఉన్న వారు సైతం ఓటు వేయడానికి పెద్ద ఎత్తున వచ్చారు. దీంతో పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద క్యూలు భారీగా కనిపించాయి. కొన్నిచోట్ల ఉదయం 7గంటలకే మొదలైన క్యూలు రాత్రి వరకూ కొనసాగాయి. ఇదే ఇప్పుడు టీడీపీ, వైసీపీలు ఎవరికి వారు తమకే అనుకూలంగా ఉన్నట్లు చెబుతున్నారు. జగన్ పాలనలో ప్రజా వ్యతిరేకత తీవ్రంగా ఉందని ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. సంక్షేమ పథకాలన్నీ నామమాత్రంగా ఇచ్చారు. అయితే తాము అర్హులందిరికీ సంక్షేమ పథకాలు అందజేశామని వైసీపీ చెబుతోంది. ఈ నేపథ్యంలో సంక్షేమ పథకాలు తీసుకున్న వారంతా జగన్‌కు ఓటు వేసేందుకు వచ్చారని వైసీపీ అంచనా వేస్తోంది. జగన్ పాలన్‌పై మేధావులు, తటస్థుల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. టీడీపీ హయాంలో సంక్షేమం సాగింది. చంద్రబాబు సీఎం అయితే మహిళలకు నెలకు రూ.1500, మూడు గ్యాస్‌సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, అమ్మఒడి ఇలా సూపర్‌సిక్స్ పథకాలు జనాల్లోకి బాగా వెళ్లాయని అంటున్నారు. దీంతో అటు పేదలతో పాటు ఇటు చదువుకున్న వారంతా తమకే ఓటు వేశారని టీడీపీ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

పోలింగ్ కేంద్రాల వారీగా ఆరా

ఎన్నికల ప్రచారం, పోలింగ్‌తో సోమవారం రాత్రి వరకు అభ్యర్థులు తీరిక లేకుండా గడిపారు. ఇక మంగళవారం కూడా బిజీబిజీగా ఉన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి.. అక్కడ ఓటర్ల నాడి ఎలా ఉంది, మనకెన్ని పడ్డాయి, ప్రత్యర్థికి ఎన్ని పడ్డాయి అంటూ లెక్కలు వేస్తూ మంగళవారం అంతా బిజీబిజీగా గడిపారు. గత ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల్లో పోలైన ఓట్లు, ఈ సారి పోల్ అయిన ఓట్లు బేరీజు వేసుకుంటున్నారు. పార్టీ నేతలతో కాకుండా ఇతర మార్గాల ద్వారా పోలింగ్ సరళిని అంచనా వేస్తున్నారు. గెలుపు మనదే అంటూ ఊహల్లో తేలుతున్నారు. ఎక్కడెక్కడ లోపాలు జరిగాయి, ఓటింగ్ శాతం తగ్గింటే ఎందుకు తగ్గిందన్న ఆలోచనలో ఉన్నారు. కాకి లెక్కలు వేసుకున్న తరువాత మనదే గెలుపు అంటూ ఇరువర్గాల వారు భావిస్తున్నారు. కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు అసెంబ్లీలకు ప్రతిష్ఠాత్మకంగా ఎన్నికలు జరిగాయి. పోటాపోటీగా నగదు పంపిణీ కూడా జరిగింది. ఎక్కడ మైనస్ ఎక్కడ ప్లస్ అంటూ లెక్కలు వేసుకుంటున్నారు. అలాగే ఎంపీ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరిగిందా అంటూ ఆరా తీస్తున్నారు.

- 13,04,256 మంది ఓటు హక్కు సద్వినియోగం
- జమ్మలమడుగు అత్యధికం 86.68 శాతం
- అత్యల్పం కడపలో 65.27 శాతం

జిల్లాలో పోలింగ్ 79.57 శాతం

కడప(కలెక్టరేట్), మే 14: ఎట్టకేలకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టం ముగిసింది. సోమవారం రాత్రి వరకు జరిగిన పోలింగ్‌లో కడప పార్లమెంట్, 7 అసెంబ్లీ నియోజకవర్గాలకు జిల్లా వ్యాప్తంగా 79.57 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో అత్యధికంగా 86.68 శాతం, కడపలో అత్యల్పంగా 65.27 శాతం మంది ఓట్లు వేశారు. జిల్లాలో 16,39,066 లక్షల మంది ఓటర్లుండగా అందులో 13,04,256 మంది ఓటును సద్వినియోగం చేసుకున్నారు. కాగా మహిళా ఓటర్లు 6,69,820 మంది, పురుష ఓటర్లు 6,34,349 మందితో పాటు థర్డ్‌జెండర్లు 87 మంది ఓట్లు వేశారు.

నియోజక వర్గాల వారీగా ఓట్లు వేసిన వారు

- బద్వేలు అసెంబ్లీలో 2,19,290 మంది ఓటర్లుండగా అందులో 1,72,662 మంది (78.74శాతం) ఓట్లు వేశారు.
- కడప అసెంబ్లీలో 2,83,543 మందికి గాను 85,111 మంది (65.27 శాతం) ఓటు వేశారు.
- పులివెందులలో 2,29,687 మంది ఓటర్లుండగా అందులో 1,86,844 మంది (81.34) ఓటు హక్కు వినియోగించుకున్నారు.
- కమలాపురం అసెంబ్లీలో 2,04,169 ఓటర్లకు గాను 1,72,413 మంది (84.44 శాతం) ఓట్లు వేశారు.
- జమ్మలమడుగులో 2,42,556 మంది ఓటర్లకు 2,10,244 మంది (86.68 శాతం) ఓటు వేశారు.
- ప్రొద్దుటూరు అసెంబ్లీలో 2,47,966 మంది ఉండగా 1,97,376 మంది (79.59 శాతం) ఓటును వినియోగించుకున్నారు.
- మైదుకూరులో 2,11,855 మంది ఓటర్లలో 1,79,693 మంది (84.82శాతం) ఓట్లు వేశారు. మొత్తం మీద కడప పార్లమెంట్ పరిధిలో 79.57 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- ఢీకొన్న టీడీపీ
- కడప, జమ్మలమడుగులో టీడీపీ, వైసీపీ బాహాబాహీ
- పరస్పరం రాళ్ల దాడులు
- జమ్మలమడుగులో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై దాడి
- కడపలో టీడీపీ, వైసీపీ మధ్య రణరంగం
- జమ్మలమడుగులో టెన్షన్ టెన్షన్
- ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డికి భద్రత పెంపు
- హౌస్ అరెస్టు

వైసీపీ కవ్వింపు చర్యలు



కడప గౌస్‌నగర్‌లో సోమవారం రాత్రి రణరంగంగా మారిన దృశ్యం

కడప/ జమ్మలమడుగు, మే 14(ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజైన సోమవారం చాపాడు మండలంలోని చిన్నగురవలూరులో టీడీపీ ఏజంటుగా కూర్చున్న వారిని బయటికి లాగి వైసీపీ నేతలు దాడి చేశారు. ఈ ఘటన మినహాయిస్తే సాయంత్రం వరకు పోలింగ్ ప్రశాంతంగా సాగింది. అయితే అనూహ్యంగా రాత్రి అటు జమ్మలమడుగులో ఇటు కడపలో జరిగిన దాడులు ఒక్కసారిగా కలకలం రేపాయి. వైసీపీ కవ్వింపు చర్యలతో ఇరువర్గాలు సవాళ్లు, ప్రతి సవాళ్లు విసురుకుంటూ రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. వెంటనే పోలీసులు అలర్ట్ అయి ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకోవడంతో పెద్ద ముప్పే తప్పింది. కడప నగరంలో జరిగిన ఈ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. ఎన్నికల ప్రచారం మొదలుకుని పోలింగ్ వరకు టీడీపీ, వైసీపీ మధ్య ఏదోచోట ఉద్రిక్తత చోటు చేసుకుంటూ వచ్చింది. వైసీపీ కవ్వింపులకు పాల్పడితే టీడీపీ వీలైనంత వరకు సంయమనం పాటిస్తూ వచ్చింది. కడపలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఎన్నికల సమయంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. గౌస్‌నగర్‌లోని పోలింగ్ బూత్‌లో ఉదయం నుంచే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అనుచరుడు ఓటర్లను ప్రలోభ పెట్టడం, సైక్లింగ్ పాల్పడుతున్నట్లు అటు టీడీపీ, ఇటు కాంగ్రెస్ వర్గాలు అనుమానించాయి. దీనికి తోడు అక్కడ ఓటింగ్ ఆలస్యంగా జరిగింది. దీంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి ఇతర నేతలు పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లగా అంజద్‌బాషా, ఆయన అనుచరుల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసి పరస్పరం రాళ్లదాడులకు తెగబడ్డారు. ఇరువర్గాలు రాళ్లు రువ్వుకోవడంతో ఆ ప్రాంతం అంతా రణరంగంలా కనిపించింది. రాత్రిపూట ఎక్కడ నుంచి రాళ్లు వస్తున్నాయో, ఎక్కడ నుంచి పడుతున్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పాటు పిడిగుద్దులు గుద్దుకోవడంతో ఆ ప్రాంతమంతా యుద్ధవాతావరణం ఏర్పడింది. వైసీపీ శ్రేణులే రెచ్చగొట్టి ఘర్షణకు కారణమయ్యారని టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన పలువురు గాయపడ్డారు. రోడ్డుపైనే రణరంగం కావడం చూసి చుట్టుపక్కల స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

జమ్మలమడుగులో జగడం

జమ్మలమడుగు ఫ్యాక్షన్ రాజకీయాలకు నెలవు. ప్రతిసారి ఏదో ఒక గొడవ జరుగుతుంటుంది. ఈసారి కూడా జమ్మలమడుగులోని ఈద్గా వద్ద ఉన్న పోలింగ్‌బూత్ 116, 117లో పోలింగ్ ఆలస్యంగా జరిగింది. అక్కడకి వెళ్లిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి టీడీపీ ఏజంట్లను బెదిరింపులకు గురి చేయడంతో ఆ విషయాన్ని ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే భూపేశ్ మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డితో కలిసి అక్కడకి వెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ వైసీపీ నేతల మధ్య ఘర్షణ జరిగి రాళ్లు రువ్వుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి గాయం అయింది. ఇక వెంకటేశ్వరస్వామి గుడి వద్ద మాజీ మంత్రి, బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి వాహనంపై వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. ఈ రెండు ఘటనలతో జమ్మలమడుగులో ఒక్కసారిగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఆందోళన కొనసాగింది.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు : డీఎస్పీ

పోలింగ్ రోజు తలెత్తిన గొడవల కారణంగా జమ్మలమడుగులో 144 సెక్షన్ కొనసాగుతోందని డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. మంగళవారం ఎర్రగుంట్ల నుంచి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఆయన అనుచరవర్గంతో సుమారు 50 నుంచి 60 వాహనాల్లో ముద్దనూరుకు చేరుకున్నారని, అక్కడి నుంచి జమ్మలమడుగుకు రాబోతున్నట్లు సమాచారం తెలుసుకున్న డీఎస్పీ హుటాహుటిన ముద్దనూరు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ వైసీపీ నేత మునిరాజారెడ్డి ఇంటి సమీపాన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వారి అనుచరుల వాహనాలను పోలీసులు ఆపేశారు. జమ్మలమడుగుకు వెళ్లకూడదని ఆదేశించారు. దీంతో మధ్యాహ్నం వరకు ముద్దనూరులో టెన్షన్ వాతావరణం నెలకొంది. ముద్దనూరులో ఉన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని ఇంటికి వెళ్లాలని గట్టిగా ఆదేశించినట్లుగా పోలీసుల ద్వారా తెలుస్తోంది. ఆయన స్వగ్రామంలో ఇంటి వద్ద, వైసీపీ కార్యాలయాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే జమ్మలమడుగు పట్టణంలోని టీడీపీ, బీజేపీ, వైసీపీ కార్యాలయాల వద్ద పోలీసు బలగాలను ఏర్పాటు చేశారు. ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డిలు దేవగుడి గ్రామానికే పరిమితం అయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసు బలగాలు చేరుకుని ఆదినారాయణరెడ్డి, భూపేశ్‌రెడ్డి ఎక్కడా కదలకుండా ఇంటి వద్దనే ఉండాలని ఆదేశించినట్లు తెలిసింది. పట్టణంలో టీ బంకుల వద్ద, వివిధ దుకాణాల వద్ద అయిదుగురికి మించి నిలబడకూడదని, 144 సెక్షన్ అమలులో ఉందని పోలీసులు హెచ్చరించారు. ఎక్కడైనా అల్లర్లకు పాల్పడినా, రెచ్చగొట్టినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా లాఠీచార్జీ చేయాల్సి వస్తుందని, నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

సుధీర్‌రెడ్డిపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు : డీఎస్పీ

జమ్మలమడుగులోని వెంకటేశ్వర కాలనీ ఈద్గా సమీపాన 116, 117 పోలింగ్ కేంద్రం లో సోమవారం రాత్రి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డిపై ఇటుకతో దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటలకు అర్బన్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పీఏ కరుణాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి నిందితుడు గోనె క్రిష్ణారెడ్డిని (50) అరెస్టు చేశామన్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఇతరత్రా విషయాల్లో సోషల్ మీడియాలో ఎవరైనా మెసేజ్‌లు చేస్తే అలాంటివారిపై కేసులు నమోదు చేస్తామని, రూ.లక్ష జరిమానా విధిస్తామని డీఎస్పీ హెచ్చరించారు. జమ్మలమడుగు పట్టణంలో జూన్ 4వ తేదీ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థులు ఆదినారాయణరెడ్డి, సుధీర్‌రెడ్డిలకు 2 ప్లస్ 2 భద్రతను పెంచామన్నారు. గతంలో ఈ ముగ్గురికి 2 ప్లస్ 2 ఉండగా ఇప్పుడు 4 ప్లస్ 4గా భద్రత పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు కరుణాకర్, రూరల్ సీఐ గోపాల్‌రెడ్డి, ఎస్ఐలు సుబ్బారావు, తిమోతి, కల్పన, పాల్గొన్నారు.

కడప నుంచి గోవాకు ప్రత్యేక బస్సు

కడప (మారుతీనగర్), మే 14: కడప నుంచి గోవాకు ఈ నెల24వ తేదీ శుక్రవారం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు ఆర్టీసీ కడప డిపో మేనేజరు ఢిల్లీశ్వరరావు తెలిపారు. ఈ గోవా ప్రత్యేక సర్వీసుకు రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. ముందస్తుగా రిజర్వేషన్ చేసుకునే వారు డబ్లుడబ్లుడబ్ల్యుఏపీఎస్ఆర్‌టీసీ.ఆన్‌లైన్.ఇన్ లో లాగిన్ అయ్యి గోవా సర్వీసు నెం.50301 బస్సుకు రిజర్వేషన్ చేసుకోవాలని లేదా కడప ఆర్టీసీబస్టాండులో ఉన్న రిజర్వేషన్ కౌంటరు ద్వారా పొందవచ్చన్నారు. ఇంద్ర ఏసీ బస్సుకు టికెట్ ధర పెద్దలకు రూ.3300, పిల్లలకు రూ.2వేలు ఉంటుందన్నారు.

చంద్రబాబు సీఎం కాబోతున్నారు

● రాయచోటిలో టీడీపీ విజయం ఖాయం: మండిపల్లి



మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మే 14: ఆంధ్ర రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకు తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి కాబోతున్నారని, రాయచోటిలో టీడీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష మేరకు చంద్రబాబు ముఖ్య మంత్రి కాబోతున్నారని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి మొదటి విడతలోనే నా పేరును ప్రకటించారని.. అప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు సహకరించిన టీడీపీ నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలియ జేశారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టగానే రాయచోటి ప్రజల కష్టాలు తీరుస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తానని తెలిపారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా నా కష్టంగా భావించి వారికి అందుబాటులో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఖాదర్‌బాషా, టీడీపీ నాయకులు సురేశ్, ఖాదర్ మొహిద్దీన్, ఎజాస్, అతావుల్లా, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే విజయం

● కమలాపురంలో టీడీపీ విజయం తథ్యం : పుత్తా



చెన్నూరులో జరిగిన కృతజ్ఞత సభలో మాట్లాడుతున్న పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, మే 14 : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమిదే విజయమని.. జూన్ 4న అధికారంలోకి రాబోతున్నామని.. కమలాపురంలో టీడీపీ గెలుపు తథ్యం అని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. చెన్నూరులోని గోసుల కళ్యాణ మండపంలో మంగళవారం టీడీపీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతో పాటు ఉమ్మడి కూటమి ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలతో సిక్సర్ కొట్టబోతున్నామని.. టీడీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాల అమలుతో పాటు నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మండల టీడీపీ నేతలు కె.విజయభాస్కర్‌రెడ్డి, పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, రాంకోటిరెడ్డి, ఇందిరెడ్డి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై కసితో ఓట్లు వేశారు..
వచ్చేది టీడీపీ ప్రభుత్వమే : పుట్టా



విజయకేతనం చూపుతున్న పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు, మే 14: వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఓటర్లు కసితో ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేశారని... వచ్చేది టీడీపీ ప్రభుత్వమేనని మైదుకూరు టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త నాది గెలుపు అని ధ్యేయంగా పని చేశారన్నారు. తనకు తోడుగా నిలిచిన ప్రతి ఒక్కరికి అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడి.. చాపాడులో టీడీపీ ఏజెంట్లపై దాడికి పాల్పడటంపై పుట్టా తీవ్రంగా స్పందించారు. దౌర్జన్యం చేయాలనుకుంటే మేము చేసే వాళ్లం. మాకు ప్రశాంతతే ముఖ్యం అని.. రౌడీయిజం, దౌర్జన్యం చేసి గెలవాలనుకోవడం మూర్ఖత్వం అన్నారు. వచ్చేది మన ప్రభుత్వమే అని.. వైసీపీ వాళ్లు కవ్వింపు చర్యలకు పాల్పడతారని.. తొందరపడి ఎవ్వరూ ఘర్షణలకు వెళ్లవద్దు... కౌంటింగ్ వరకు సంయమనం పాటించాలని కార్యకర్తలకు సూచించారు. దాడిలో గాయపడ్డవారి కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు. కాగా ఎమ్మెల్యే సొంత గ్రామం నక్కలదిన్నెలో పోలింగ్ ఏజెంట్లుగా కూర్చున్న వారిని ఆయన సన్మానించారు. నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధి ఉంటే..
సంక్షేమ పథకాల సొమ్ము ఇపుడు జమచేయాలి

● ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించిన టీడీపీ ఏజెంట్లు, కార్యకర్తలు

● పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి బీటెక్ రవి



సమావేశంలో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, మే 14: జగన్ ఎప్పుడో బటన్ నొక్కిన వాటికి ఎన్నికలకు ముందు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు వేసి ఓటర్లను ప్రలోభపెట్టాలని చూడ్డంతో ఎన్నికల కమిషన్ అడ్డుకుందని పులివెందుల ఎమ్మెల్యేగా టీడీపీ నుంచి పోటీ చేసిన బీటెక్ రవి అన్నారు. ఓటింగ్ ముగిసిందని ఆయనలో చిత్తశుద్ధి ఉంటే సంక్షేమ పథకాల సొమ్ము ఇప్పుడు జమచేయాలన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పులివెందులలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎవరి ఓటు వారు వేసుకునేలా పరిస్థితి కల్పిస్తామని ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామన్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, మహిళలు తమకే మద్దతు తెలిపారన్నారు. పులివెందులలో ఎప్పుడూ జరగని విధంగా ఫెయిర్ పోలింగ్ జరగడంతో ప్రజలే టీడీపీని అభినందిస్తున్నారని అన్నారు. వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా ఉంటాడనే ఉద్దేశంతో పోలీసు వ్యవస్థ వారికి అనుకూలంగా పనిచేశారన్నారు. వైసీపీ వారు గుంపులు గుంపులుగా పోలింగ్ కేంద్రాల వద్ద ఉన్నా ఏమీ అనలేదన్నారు. మధ్యాహ్నం 3గంటల తర్వాత వైసీపీ వాళ్లు టీడీపీ ఏజెంట్లను ప్రలోభపెట్టేస్థాయికి దిగజారారన్నారు. అసలు సీఎంకి ఎన్నికలు జరిగాయా లేకుంటే ఎంపీకి జరుగుతున్నాయా అర్థం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుమరుగైన కోహినూర్ దోస

● పెట్టుబడులు కూడా దక్కని వైనం

● మూడేళ్లుగా పంట సాగు చేయని రైతులు

రాజంపేట, మే 14: రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో కోహినూర్ దోస సాగు కనుచూపుమేరలో కానరాకుండా పోయింది. పెట్టిన పెట్టుబడులు కూడా దక్కకపోవడంతో మూడేళ్లుగా ఈ పంటను సాగు చేయడం రైతులు మానుకున్నారు. ఈ పంట పదేళ్ల కిందట అనంతపురం జిల్లాలో విస్తారంగా సాగయ్యేది. రాజంపేట, కోడూరు ప్రాంతాల్లో అక్కడక్కడా ఈ పంటను సాగు చేసేవారు. అయితే ఆదిలోనే హంసపాదు అన్నట్లు ఈ పంటకు అధిక తెగుళ్లు సోకడం, పంట పాడవ్వడం జరుగుతుండటంతో ఈ పంట సాగు చేయడం పూర్తిగా మానుకున్నారు. గతంలో రైల్వేకోడూరు, చిట్వేలి, పుల్లంపేట, ఓబులవారిపల్లె మండలంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో ఈ పంటను విస్తారంగా సాగుచేసేవారు. ప్రస్తుతం ఇక్కడ వంద ఎకరాలకే ఈ పంట సాగు పరిమితమైంది. కష్టమెక్కువ.. ఆదాయం తక్కువ... అన్న చందంగా మార డంతో ఈ పంటను సాగుకు ఆసక్తి కనబరచడం లేదు. కొందరు రైతులు చేసేది లేక కొద్దిపాటి పంట సాగు చేస్తున్నా గిట్టుబాటు ధరలు రాక పోవడంతో పంటను వదిలేస్తున్నారు.



ఢిల్లీకి ప్రత్యేక లారీలలో బాక్సుల ద్వారా కోహినూర్ దోసకాయలను పంపుతున్న దృశ్యం

ఈ పంట సాగు చేయాలంటే ఒక కిలో విత్తనాలను ఏకంగా రూ.70వేలు పెట్టి కొనుగోలు చేసేవారు. కిలో విత్తనాలు సుమారు 3ఎకరాలకు సరిపోయేవి. 66 రోజుల్లో ఈ పంట చేతి కొస్తుంది. డ్రిప్ ఇరిగేషన్ పద్ధతుల్లో ఈ పంటను సాగు చేసేవారు. ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్‌కు, విత్తనాల కొనుగోలుతో సేద్యపు ఖర్చులు ఎక్కువగా వచ్చేవి. మల్చింగ్ షీట్‌ను పొలంపై వేసి చిన్నచిన్న రంధ్రాలు ఏర్పాటు చేసి రంధ్రాలలో విత్తనాలు పెట్టి ఈ పంటను సాగు చేస్తారు. ఈ విధంగా కేవలం ఎకరా సాగుకు లక్ష రూపాయలు ఖర్చు అయ్యేది. ఒక ఎకరాకు 14 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ కాయలను కేవలం ఢిల్లీకే ఎగుమతి చేస్తారు. ఎంతో రుచికలిగి చూడటానికి ఎంతో ఇంపుగా ఉండే ఈ దోస మార్కెట్‌లో మంచి లాభాలను ఇస్తుంది. ఒక లారీ ఢిల్లీకి పంపాలంటే లారీ బాడుగ ఖర్చు లక్ష, ప్యాకింగ్ ఖర్చు 40వేలు ఇతర ఖర్చులు మరో 20వేలు ఉంటుంది. మొత్తం రూ.1.60 లక్షలు దాటుతుంది. ఇక సాగు ఖర్చు కలుపుకుంటే ఒక్కో ఎకరాకు సుమారు 3 లక్షల రూపాయలు ఖర్చు వస్తుంది. అయితే ఢిల్లీకి ఒక్కో లారీకి 1650 బాక్సులను పంపుతారు. మామూలుగా ఒక్కో బాక్సు రూ.400 వరకు ధర ఉంటుంది. అయితే బాక్సు ధర రూ.300లు అంత కంటే తక్కువ ఉంటే పెట్టిన పెట్టుబడి కూడా దక్కడం లేదు. ఒక్కోసారి కాయలు దెబ్బతింటే లారీకి మరో 50 వేల రూపాయలు నష్టపోవాల్సి వస్తుంది. ఇక పంట సాగు చేసిన మొదట్లో చీడపీడలు పడినా.. వాతావరణంలో మార్పులు వచ్చినా.. అంతే సంగతులు. పెట్టిన పెట్టుబడి అంతా నేలపైన వదలాల్సిందే.. ఈ విధంగా రైతులు ఎంతో కష్టపడి భారీగా పెట్టుబడులు పెట్టినా ఒక్కసారి కూడా లాభాలు రాకపోవడంతో రైతులు కోహినూర్ దోసపై ఆసక్తి కనబరచడం లేదు.



పెరుమాండ్లపల్లె ప్రాంతంలో సాగుచేసిన కోహినూర్ రకం దోస



ఎగుమతి చేయడానికి బాక్సుల్లో కాయలు వేస్తున్న రైతు కూలీలు

వైభవంగా బ్రహ్మంగారి గురుపూజ మహోత్సవాలు ప్రారంభం

బ్రహ్మంగారిమఠం, మే 14: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజా మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 19వరకు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవదాయశాఖ అసిస్టెంటు కమిషనర్ శంకరబాలాజీ తెలిపారు. మే 17 వైశాఖ శుద్ధ దశమి శుక్రవారం స్వామివారు సజీవ సమాధి నిష్టవహించిన పవిత్ర దినం కావడంతో ఆ రోజు దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. 18న శనివారం రథోత్సవం ఉంటుందని.. భక్తులందరూ పాల్గొనాలని కోరారు. అలాగే ప్రతిరోజూ ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కాగా, ఆలయ ప్రాంగణంలో భక్తులకు తాగునీరు, వసతి, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తులందరూ ఆరాధన గురుపూజా మహోత్సవాలకు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని అసిస్టెంటు మేనేజరు శంకర బాలాజీ కోరారు. మంగళవారం ఉదయం 5గంటలకు వీరబ్రహ్మేంద్ర స్వామి సుప్రభాతం, నామసంకీర్తనం, 8గంటలకు అభిషేకం, సహస్ర నామార్చన, రాత్రి 7గంటలకు శేష వాహనోత్సవంపై వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవింద మాంబ గుడిఉత్సవం నిర్వహించారు.



శేష వాహనంపై ఊరేగిన వీరబ్రహ్మేంద్రస్వామి

చక్రస్నానంతో ముగిసిన బ్రహ్మోత్సవాలు



శ్రీచక్రాన్ని అభిషేకిస్తున్న పూజారులు

వల్లూరు, మే 14 : పుష్పగిరి క్షేత్రంలో జరుగుతున్న కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు మంగళవారం వైభవోపేతంగా చక్రస్నానం నిర్వహించారు. ఉదయాన్నే వివిధ వైద్యనాథేశ్వర త్రిశూలం, చెన్నకేశవుని శ్రీచక్రం నది ఒడ్డుకు తీసుకువచ్చి వేద మంత్రాల నడుమ అభిషేకాలు, జపాలు నిర్వహించారు. అనంతరం భక్తుల మధ్య స్థానిక అర్చకులు అఖిల్, రాజేశ్‌లు చక్రస్నానం నిర్వహించారు. నదిలో నీరు లేకపోవడంతో భక్తులు కొంత నిరుత్సాహపడ్డారు. శివకేశవులను ఏటి వద్దకు తీసుకువచ్చి పూజలు చేసిన అనంతరం చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం కొండపైన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి సన్నిధిలో పుష్పయాగం చేశారు. ఈ సందర్భం గా వివిధ పూలను తీసుకువచ్చి ఈయాగంలో స్వామివారికి అర్చన చేస్తూ నివేదిస్తూ పుష్పయాగం నిర్వహించారు. అనంతరం ధ్వజావరోహణ చేసి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.

నేడు వెల్లాలలో తలనీలాల వేలం పాట

రాజుపాలెం, మే 14: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వెల్లాల సంజీవరాయస్వామి ఆలయానికి సంబంధించి ఈ నెల 15న బుధవారం తలనీలాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి బీవీ నరసయ్య తెలిపారు. దేవస్థాన ఆలయ ఆవరణలో జరిగే వేలంలో పాటదారుడు లక్ష ధరావత్తు నగదు రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో హెచ్చు పాటదారునికి భక్తులు సమర్పించిన తలనీలాలు ఏడాదిపాటు పోగు చేసుకోవచ్చని ప్రకటనలో తెలిపారు.

రేపు ఆలయభూముల కౌలువేలం

పగిడాల గ్రామంలో వెలసిన చెన్నకేశవస్వామి దేవాలయానికి సంబంధించిన భూములకు 16న గురువారం ఉదయం 11గంటలకు ప్రొద్దుటూరులోని నారాయణ రంగయ్య సత్రంలో కౌలు వేలం వేస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి రామచంద్ర చార్యులు తెలిపారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులు పదివేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో 62.22 ఎకరాల భూమిని హెచ్చుపాటదారునికి మూడేళ్ల పాటు కౌలు భూమిగా సాగు చేసుకోవచ్చన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి



పుష్పరాజు మృతదేహం వద్ద గుమిగూడిన తోటి కూలీలు, పుష్పరాజు (ఫైల్)

చాపాడు, మే 14: మొరాయిపల్లె వాసి, ఉపాధి కూలి మారం పుష్పరాజు (60) గుండెపోటుతో మృతి చెందినట్లు ఏపీఓ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం సోమాపురం వద్ద వంకలో మట్టి పనిచేస్తుండగా ఆయన ఒక్కసారిగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య ఉన్నారు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లు పుష్పరాజు మృతదేహానికి నివాళులర్పించారు. పుష్పరాజు కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేస్తున్నట్లు జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కడప (క్రైం), మే 14 : కడప నగరం గౌస్‌నగర్‌లో సోమవారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో రెండు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ ఇబ్రహీం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. గౌస్‌నగర్‌లోని పోలింగ్ బూత్ వద్ద ఇరువర్గాలు రాత్రి కవ్వింపు చర్యలకు పాల్పడి.. పరస్పరం రాళ్లు రువ్వుకోవడంతో పలువురికి గాయాలైనట్లు తెలిపారు. దీంతో టీడీపీ, వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో విచారిస్తున్నట్లు తెలిపారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

చెన్నూరు, మే 14: చెన్నూరు బ్రాహ్మణవీధికి చెందిన సిద్ధవటం గోపాల్ (62) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. తమలపాకు తోటల్లో కూలీగా పని చేసే ఆయన రోజూ బతుకుదెరువు కోసం పనులకు వెళ్లేవాడు. ఇటీవల ఎండలు ఎక్కువగా ఉండడంతో మంగళవారం పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన ఆయన అస్వస్థతకు గురై ఒక్కసారిగా నేలపై పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతిచెందాడు.

కారు ఢీ కొనడంతో యువకుడి మృతి

పీలేరు, మే 14: పీలేరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయి(36) అనే యువకుడు మంగళవారం దుర్మరణం చెందాడు. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన సా యి ఎలక్ట్రీషియన్ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనంలో పీలేరుకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ పెట్రోలు బంకు వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు సాయిని హుటాహుటి న పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందిన ట్లు వైద్యులు నిర్ధారించారు. సాయికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని దుర్మరణంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. పీలేరు ఎస్ఐ నరసింహుడు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్‌కు గాయాలు



గాయపడ్డ కానిస్టేబుల్ చికిత్స నిమిత్తం తరలిస్తున్న బెటాలియన్ పోలీసులు

సిద్ధవటం, మే 14: రోడ్డు ప్రమాదంలో బెటాలియన్ కానిస్టేబుల్ కలాం బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ బెటాలియన్ ఎదురుగా ఉన్న హోటల్ వద్దకు కలాం బాషా ద్విచక్ర వాహనంలో వెళ్లేందుకు రోడ్డు క్రాస్ చేస్తుండగా రాంగ్‌రూట్‌లో వచ్చిన మారుతీ వ్యాను ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. దీంతో కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బెటాలియన్ పోలీసులు పోలీసు సంక్షేమ విభాగం అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

పెనుగాలులకు అరటి నేలమట్టం

● 750 ఎకరాలలో పంట ధ్వంసం

● నష్టం రూ. 10కోట్లకు పైమాటే...

పులివెందుల రూరల్, మే 14: పెనుగాలులు రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చాయి. పులివెందుల మండలంలో వీచిన పెనుగాలులకు భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. డ్రిప్ పరికరాలు కొట్టుకుపోయాయి, అరటి తోటలు, మిరప పంట నేలమట్టం అయ్యా యి. నల్లపురెడ్డిపల్లె, ఇ.కొత్తపల్లె, యర్రబల్లె, నల్లగొండువారిపల్లె తదితర గ్రామాలలో రైతులకు భారీ నష్టం వాటిల్లిం ది. దాదాపు 750 ఎకరాలలో అరటి పంట నేలమట్టంకావడంతో దాదాపు రూ.10కోట్లకు పైగా నష్టం వాటిల్లింది. ఆదివారం, సోమవారం ఎన్నికల విధుల్లో ఉన్న కారణంగా ఉద్యానశాఖ అధికారులు మంగళవారం ఆయా గ్రామాలకు వెళ్లి పంటలను పరిశీలించారు. ప్రాథమికంగా 750 ఎకరాల దాకా అరటి పంటల ధ్వంసమైనట్లు ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.



యర్రబల్లె పంచాయతీలో కూలిపోయిన అరటితోటలు

నల్లపురెడ్డిపల్లె గ్రామ పరిధిలో కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్



అలాగే ఆయా గ్రామాల పరిధిలో 50విద్యుత్ స్తంభా లు విరిగిపోయాయి. 4 ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీనితో ఆయా గ్రామాల పరిధిలో సోమవారం రాత్రి అంధకారంలో ఉన్నట్లు ప్రజలు తెలిపారు. విద్యుత్ సిబ్బంది వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించి విద్యుత్ సరఫరా అందించినట్లు విద్యుత్‌శాఖ రూరల్ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. విద్యుత్ శాఖకు రూ.4లక్షల దాకా నష్టం వాటిల్లిందని తెలిపారు.

లింగాల మండలంలోని ఇప్పట్ల పంచాయతీ పరిధిలో 100ఎకరాలు, చిన్నకుడాల పంచాయతీ పరిధిలో 50ఎకరాలలో అరటి పంటకు నష్టం వాటిల్లినట్లు ఉద్యానశాఖ అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

నష్టపరిహారం పెంచాలి

750 ఎకరాలలో అరటిపంట నేలమట్టం కావడంతో నష్టం తీవ్రంగా ఉందని రైతులు అంటున్నారు. గెలలతో ఉన్న పంటలతో పాటు రెండో దఫా, మూడో దఫా గెలలు వస్తున్న చెట్లు సైతం నేలకొరిగాయి. అయితే ప్రభుత్వం క్రాప్ డ్యామేజ్ ఇన్సూరెన్స్ కింద ఎకరాకు రూ.10వేలు చెల్లిస్తుందని రైతులు తెలిపారు. ఎకరా పంట సాగుకు దాదాపు రూ.2 నుంచి రూ.3లక్షలకు పైబడి ఖర్చు వస్తుందని.. ఇన్సూరెన్స్ ఇంత తక్కువ ఇస్తే ఎక్కడికి సరిపోదని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చచ్చిపోయే ముందు నీళ్లు చల్లి లేపినట్లు ఉంటుంది ఈ సాయం అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచించి నష్టంపరిహారం పెంచాలని రైతులు కోరుతున్నారు.

జూన్ 6 వరకు సెక్షన్ 144 అమలు

● కడప డీఎస్పీ షరీఫ్

కడప (క్రైం), మే 14 : కడప అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 14వ తేదీ ఉదయం నుంచి జూన్ 6 వరకు సెక్షన్ 144 అమలులో ఉంటుందని కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి (కలెక్టరు) ఆదేశాలు జారీ చేశారన్నారు. ఏపీ శాసనసభకు, లోక్‌సభకు 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలను పరిరక్షించడానికి, ఎన్నికల నిర్వహణలో చోటు చేసుకున్న అ వాంఛనీయ సంఘటనలను నివారించడానికి కడప ని యోజకవర్గం పరిధిలోని కౌంటింగ్ సెంటరుగా గుర్తించి న మౌలానా అబుల్ కలాం నేషనల్ ఉర్దూ యూనివర్సి టీ పరిసర ప్రాంతంలో పీసీ 1973లోని సెక్షన్ 144 అమలులో ఉంటుందని ఈ సందర్భంగా డీఎస్పీ వివరించారు.

వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నాగరాజు

వీరపునాయునిపల్లె, మే 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) కడప జిల్లా ఉపాధ్యక్షుడిగా కన్నెలూరు నాగరాజు నియమితులయ్యారు. మంగళవారం వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరపునాయునిపల్లె మండలం ఎన్.పాలగిరి గ్రామానికి చెందిన నాగరాజు మాట్లాడుతూ తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.



కన్నెలూరు నాగరాజు

ఘనంగా రాహుకాల పూజలు



కడప (కల్చరల్), మే 14: కడప నగరం బిల్టప్ సర్కిల్ సమీపంలోని విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో అమ్మవారి ఆలయం భక్తులతో కళకళలాడింది.



'మైదుకూరు ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి'

కడప (మారుతీనగర్) మే14:మైదుకూరు ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ (మందకృష్ణవర్గం) జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు కె.ఎస్.రాజు అన్నారు.ఈనెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికలలో మైదుకూరు నియోజకవర్గం చా పాడు మండలం చిన్న గురువులూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఏజెంట్‌గా కూర్చున్న దళితవర్గానికి చెందిన కుచ్చుపాప ఉగ్రనరసింహులు అనే వ్యక్తిని మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలోనే ఆయన అనుయాయులు దాడిచేయ డం దారుణమన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలే కరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి విజయమే లక్ష్యంగా తమ అధినేత మందకృష్ణ మాదిగ తమకు దిశానిర్దేశం చేశారన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డిపై యస్సీ, యస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులను డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ అదినాయకుడు మందకృష్ణమాదిగను మైదుకూరుకు రప్పిం చి శాంతియుతంగా నిరవధిక దీక్షకు సైతం వెనుకాడబోమన్నారు.

అంజద్ గారూ... సంస్కారం నేర్చుకోండి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి

కడప (మారుతీనగర్), మే 14: అంజద్ గారూ... సంస్కారం నేర్చుకోండి కడప (మారుతీనగర్), మే 14: 'బాధ్యతగల ప్రజా ప్రతినిధిగా, రాష్ట్ర డిప్యూటీ సీఎంగా ప్రజలకు దిశానిర్దేశం చూపాల్సిన అంజాద్‌బాషా గారూ.. మీరు సంస్కారం నేర్చుకోండి' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీని వాసరెడ్డి, టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 13న జరిగిన ఎన్నికలలో కడపలో ఓడిపోతాననే భయతంతో దగ్గరుండి తమ పార్టీ కార్యకర్తలపై వైసీపీ అల్లరిమూకతో గౌస్ నగర్‌లో రాళ్లదాడికి పాల్పడి నోటి కొచ్చినట్లు మాట్లాడడం సరైంది కాదన్నారు. మంగళవారం స్థానిక ద్వారకానగర్‌లోని వారి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే పోలింగ్ బూత్‌ల వద్ద అలా మాట్లాడటం సరికాదన్నారు. పది సంవత్సరాలుగా కడపలో అంజద్‌బాషా ఆడిందే ఆట...పాడిందే పాటగా ఉందని, ఆయన గూండాలతో కడపలోని పలు బూత్‌లలో రిగ్గింగ్‌కు పాల్పడి గెలిచేవారన్నారు. కాగా ప్రస్తుత ఎన్నికలలో ఆయన పప్పులు ఉడకకుండా టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారన్నారు. దీంతో సహనం కోల్పోయి ఇష్టానుసారంగా వాఖ్యలు చేస్తున్నారన్నారు. ప్రజాసేవ ముసుగులో కడప నగరాన్ని భ్రష్టుపట్టించి, ఇక్కడి యువతను మత్తు పదార్థాలకు (గంజాయి) బానిసలుగా మార్చారన్నారు. ఆయన సోదరుడు సాగించే భూములు, స్థలాలు, కొండలు, గుట్టలు, వాగులు, వంకల ఆక్రమణలకు యువతను పావులుగా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల ఫలితాల్లో కూటమి (టీడీపీ-బీజేపీ-జనసేన) ప్రభంజనం తథ్యమన్నారు. కూటమికి 130 నుంచి 140 స్థానాలలో విజయభేరి మోగించనుందన్నారు. జిల్లాలో సైతం అనూహ్య ఫలితాలు రావడం ఖాయమన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, జిలానీబాష, చిట్టిబోయిన సుబ్బరాయుడు, రాజు, రెడ్డయ్యయాదవ్, బండి ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజాపీఠంతో సామాన్యులకు న్యాయం

● 29న జాతీయ లోక్ అదాలత్



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి లావణ్య

కమలాపురం రూరల్, మే 14 :ప్రజాపీఠంతో సామాన్యులకు న్యాయం జరుగుతుందని కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.లావణ్య తెలిపారు. మంగళవారం కమలాపురం కోర్టు ఆవరణంలో న్యాయవాదులతో కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి ఎస్.లావణ్య ఆధ్వర్యంలో ఈ నెల 29న జరిగే జాతీయ లోక్ అదాలత్ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీ మార్గం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కక్షిదారులకు న్యాయవాదులు అవగాహన కల్పించాలని సూచించారు. కక్షలు, కార్పణ్యాలను లోక్ అదాలత్ దూరం చేస్తుందని లోక్ అదాలత్‌లో కేసులు పరిస్కారం చేసుకున్న తరువాత ఇరుపార్టీలు స్నేహభావంతో ఉంటారని అన్నారు. రాజీ మార్గం వల్ల కలిగే ప్రయోజనాల గురించి కక్షిదారులకు న్యాయవాదులు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమలాపురం న్యాయవాదుల సంఘం అధ్యక్షులు బి.పుష్పరాజ్, సహాయ కార్యదర్శి బి.ఉదయకిరణ్, న్యాయవాదులు బి.నారాయణరెడ్డి, మహేశ్, శివ పాల్గొన్నారు.

ప్రశాంత ఓటింగ్‌పై సర్వత్రా హర్షం


పులివెందుల రూరల్, మే 14: పులివెందులలో ప్రశాంతంగా ఓటింగ్ జరగడంపై అన్ని వర్గాలు ఊపిరిపీల్చుకున్నాయి. సోమవారం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9గంటల వరకు సాగింది. అంత సమయం ఓటింగ్ సాగినప్పటికి పులివెందులలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడంపై అందరు ఆశ్చర్యాన్ని వెలిబుచ్చుతున్నారు. వేముల మండలం మబ్బుచింతలపల్లెలో రాళ్లదాడులు, వేంపల్లె పట్టణంలో టీడీపీ ఏజెంట్‌పై దాడి జరిగిన ఘటనలు మినహా చెప్పుకోనేస్థాయి గొడవలు ఏవీ జరగకుండా ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది.

'సమస్య పరిష్కారంలో మధ్యవర్తిత్వం ప్రయోజనకరం'

కడప(రూరల్) ఏప్రిల్ 14 : సమస్య పరిష్కారంలో మధ్యవర్తిత్వం ఎంతో ప్రయోజనకరమని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ఆవరణంలోని న్యాయసేవాసదన్‌లో న్యాయవాదులకు మధ్యవర్తిత్వం అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ అన్నారు. ఇది వివాదాల పరిష్కారానికి మంచి పద్ధతి అన్నారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. మధ్యవర్తిత్వ చట్టం 2023 వివరించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎన్.హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, మధ్యవర్తిత్వ న్యాయవాది చంద్రకాంతమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

17న సీనియర్స్ మహిళల క్రికెట్ ఎంపికలు

కడప (స్పోర్ట్స్), మే 14: కడప రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 17వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు తలపెట్టిన సీనియర్స్ అండర్-23, అండర్-19, అండర్- 15 మహిళల క్రికెట్ ఎంపికలు జరగనున్నాయని, క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల మహిళా క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరుకావాలని కోరారు. ఆధార్‌కార్డు కాపీ, బర్త్ సర్టిఫికెట్, పాస్ పోర్ట్‌సైజ్ ఫోటో, స్టడీ సర్టిఫికెట్, టెన్త్‌క్లాస్ మార్క్‌లిస్టు, ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, తమ కిట్ బ్యాగ్‌లు వెంట తీసుకురావాలన్నారు.















ఎన్నికలు ముగిశాయి ఇక కోతల పర్వం



పోరుమామిళ్ల, మే 14: ఒకటి రెండు ఘటనలు మినహా సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఇంత వరకు ఎన్నికలు అంటూ కార్యకర్తలు, నేతలకు తోడై వెళ్లిన రైతులు నాయకుల మెప్పు కోసం మాది ఇంత అని చెప్పుకోవా లనే తాపత్రయం కోసం కోతలకు ఉపక్రమించారు. ఎన్నికల ముందు నాయకుల మెప్పులు పొందేందుకు తమ తమ ప్రాంతాల్లో ఎక్కువ మెజార్టీ తెస్తామని తమ కులపోళ్లు తమ మాట జవదాటరని ఈ సారి ఎన్నికల్లో మా పోలింగ్ బూత్‌లో ఎక్కువ మెజార్టీ తెస్తామని ప్రగల్భాలు పలికిన కోతల రాయుళ్ల కోతలు మొదలయ్యాయి. సోమవారం ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంగళవారం ప్రధాన పార్టీల కోతల రాయుళ్లు ఆ నాయకుల ఇళ్ల వద్ద ప్రదక్షిణలు చేస్తూ తాము ఎన్నికల్లో చేసిన తప్పులను కప్పి పుచ్చుకుంటూ మా పోలింగ్ బూత్‌లో మెజార్టీ చూడండి, మా సత్తా తెలుస్తుంది అంటూ బీరాలు పలుకుతూ మెప్పు పొందు తున్నారు. కొందరైతే ఎంతైనా పందెం కాయడానికి సిద్ధంగా ఉన్నాం, పంచాయతీ లెవల్‌లో మెజార్టీ మీద ఎవరైనా పందానికి వస్తారా అంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ కోతలు కోస్తున్నారు. మరికొందరైతే డబ్బుల పంపకం విష యంలో తేడాలు రావడంతో వాటిని కప్పి పుచ్చుకునేందుకు నాయకుల వద్ద లేనిపోని హంగామాలు సృష్టిస్తున్నారు. ఇప్పటికే బూత్, గ్రామ స్థాయి పంచాయతీ, మండల స్థాయి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ ప్రగల్భాలు పలుకుతున్నారు. వీరి ప్రగల్భాలకు జూన్ 4న తెర పడనుంది. అంత వరకు కోతల రాయుళ్ల మాటలు వినలేక తలలు పట్టుకోవాల్సిందే అంటున్నారు. ఎవరి సత్తా ఏంటో ఆ రోజు చూద్దాంలే అప్పుడు ఇదే మాటలు వస్తాయా, తప్పించుకుని తిరుగుతారా అనేది తేటతెల్లమవుతుంది.

'కాంగ్రెస్‌ను ఆదరించిన ప్రజలకు ధన్యవాదాలు'

ప్రొద్దుటూరు టౌన్, మే 14: ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి ఆదరించిన ప్రజలకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పీఎండీ నజీర్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో తనకు, ఎంపీగా వైఎస్ షర్మిలకు ఓట్లు వేసి ఆదరించడం సంతోషంగా ఉందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే షర్మిల కేంద్ర మంత్రి అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక హోదాతో పరిశ్రమలు ఏర్పాటవుతాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ నిర్మాణం, పోలవరం పూర్తవుతుందని తెలిపారు.



జిల్లాలో భారీ పోలింగ్

ఎవరి అంచనాలు వారివి ● లెక్కల్లో నేతలు ● ఓటెత్తిన మహిళలు

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జిల్లాలో భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. ఎప్పుడూ ఇంత భారీగా పోలింగ్ జరిగిన దాఖలాలు లేవని పలువురు విశ్లేషకులు వివరిస్తున్నారు. అంతేకాకుండా ఈ దఫా మహిళలే పెద్ద మొత్తంలో ఓటింగ్‌లో పాల్గొన్నారు. నాయకులు ఎవరి అంచనాల్లో వారున్నారు. గెలుపోటములు జూన్ నాలుగో తేదీన బహిర్గతమవుతుంది. వివరాల్లోకెళితే...

మైదుకూరులో 84.86 శాతం పోలింగ్

మైదుకూరు, మే 14: సార్వత్రిక ఎన్నికల్లో మైదుకూరు నియోజకవర్గంలో 84.86 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 2,11,855 మంది ఓటర్లుండగా 1,79,785 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,04,216 మంది పురుషులకు 87,881 మంది, 1,07,765 మంది మహిళలకు 91,903 మంది ఓట్లు వేశారు. నియోజకవర్గంలో ఐదుగురు ట్రాన్స్‌జెండర్లుండగా ఒక్కరు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మండలాల వారీ పోలింగ్ వివరాలు

● మైదుకూరు మండలంలో మొత్తం 64323 ఓట్లకు 54621 పోల్ అవగా 84.91 శాతంగా నమోదైంది. దువ్వూరు మండలంలో మొత్తం 40822 ఓట్లకు 35793 పోల్‌అవగా 87.68 శాతంగా నమోదైంది. చాపాడు మండలంలో మొత్తం 32441 ఓట్లకు 28682 పోల్ అవగా 88.41 శాతంగా నమోదైంది. ఖాజీపేట మండలంలో మొత్తం 42650 ఓట్లకు 34914 పోల్ అవగా 81.86 శాతంగా నమోదైంది. బి మఠం మండలంలో మొత్తం 31619 ఓట్లకు 25775 పోల్ అవగా 81.51 శాతంగా నమోదైంది. కాగా చాపాడు మండలంలో అత్యధికంగా 88.41 శాతం పోల్ కాగా అత్యల్పంగా బి.మఠంలో 81.86 శాతం పోల్ అయ్యింది.

జమ్మలమడుగులో 86.68 శాతం పోలింగ్

జమ్మలమడుగు, మే 14: సోమవారం ఉదయం 7 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరిగింది. సాయంత్రం 5 గంటలకు ఉన్నట్లుండి వర్షం కురవడంతో సుమారు గంటపాటు ఆలస్యం జరిగినట్లు అధికారుల ద్వారా తెలిసింది. అయితే కొన్ని ప్రాంతాల్లో గొడవలు జరగడం, పోలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమైనట్లు తెలిసింది. రాత్రి పొద్దుపోయేవరకు అధికారులు పోలింగ్ శాతాన్ని సమాచారం తెలియజేయలేదు. జమ్మలమడుగులో మొత్తం ఓట్లు 2,42,556 మంది ఉన్నారు. పురుషులు 1,02,789 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలు 1,07,449 మంది ఓటు హక్కును వినియోగించుకోగా ముగ్గురు ట్రాన్స్‌జండర్లు ఓటు హక్కును వినియోగించుకోగా 86.68 శాతం నమోదనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

84.61 శాతం పోలింగ్

కొండాపురం, మే 14: మండలంలో మొత్తం 35,022 ఓట్లు ఉండగా 29,632 ఓట్లు పోలయ్యాయి. దీంతో 84.61 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలోని గ్రామాల్లో పోలింగ్ శాతం వివరాలను పరిశీలిస్తే టి.కోడూరు 92.93 శాతం, సిరిగేపల్లి 95.39, ఎస్.కొత్తపల్లె 95.28, సంకేపల్లె 95.06, ఎర్రగుడి 90.24, చామలూరు 93.26, తిరుమాలయపల్లె 95.77, దొబ్బుడుపల్లె 92.23, గండ్లూరు 86.44, పి.అనంతపురం 74.41, చౌటిపల్లె 85.93, ముచ్చుమర్రి 91.72, దత్తాపురం 85.685, బుక్కపట్నం79.6, కె.సుగుమంచిపల్లె 84.49, తాళ్లప్రొద్దుటూరు 84.605, కె.వెంకటాపురం 89.35, ఏటూరు 90.82, నేదరపేట 93.3, బురుజు పల్లె 90, కోనవారిపల్లె 79.9, బెడుదూరు 68.75, ఎనమలచింతల 94.32, బి.కొట్టాలపల్లె 93.5, పొట్టిపాడు 87.65, వెంకయ్యకాలువ 90.19, లావనూరు 92.7, ఎస్.తిమ్మాపురం 80.24, కొండాపురం 71.297, ఓబన్నపేట 74.90 శాతం నమోదైనట్లు తహసీల్దార్ సి.శ్రీనివాసులు తెలిపారు.

రాజుపాలెం మండలంలో 90.8 శాతం

రాజుపాలెం, మే 14: రాజుపాలెం మండలంలోని 15 పంచాయతీలు, 22 గ్రామాల్లో మొత్తం 33 పోలింగ్ స్టేషన్లలో 25146 మందికి 22845 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు వ్యవస్థ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.







సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎండను సైతం లెక్క చేయకుండా ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, ఎర్రగుంట్లలో పోటెత్తిన మహిళలు (ఫైల్ ఫొటోలు)

ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడు

విస్తరణకు నోచుకోని రోడ్లు ● వాహనాల రాకపోకలకు అంతరాయం ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు





జమ్మలమడుగు కూరగాయల మార్కెట్ ఎదురుగా నిలిచిపోయిన ట్రాఫిక్ - మార్కెట్‌రోడ్డులో బట్టల దుకాణాల ఎదురుగా నిలిచిపోయిన వాహనాలు

జమ్మలమడుగు, మే 14: పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరేదెన్నడోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. గాంధీ విగ్రహం నుంచి కూరగాయల మార్కెట్‌వీధి రోడ్డు ఇరుకుగా మారింది. ప్రతి ఒక్కరూ రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లుగా తెలుస్తోంది. డ్రైనేజీపై దాటి రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. తోపుడుబండ్లు, ద్విచక్ర వాహనాలు, రోడ్డుకు అంతరాయం కలిగిస్తున్నాయి. అదే రోడ్డులో బట్టల వ్యాపారం హోల్‌సేల్ వ్యాపారులు, పెద్ద పెద్ద దుకాణాలు ఉన్నాయి. వాటి ఎదురుగా బట్టల గట్టాలు, మరికొందరు కూరగాయలను రోడ్డుపై పెట్టడం, ద్విచక్ర వాహనాలు పెడుతుంటారు. అధికారులకు తెలిసినా సమస్య ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శలున్నాయి. ఉదయం గంగమ్మ దేవాలయం వద్ద నుంచి పాత బస్టాండు గాంధీ విగ్రహం వరకు ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. దీంతో ఆ రోడ్డున వాహనదారులు వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య తీవ్రంగా ఉన్నా పోలీసు సిబ్బంది, అధికారులు ఎవరూ తొంగి చూడడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే దారిలో రోడ్డు గుంతలున్నాయి. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రోడ్డు విస్తరణ లేక ట్రాఫిక్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఏ ఒక్క అధికారీ స్పందించడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆ రోడ్డులో ట్రాఫిక్ నియంత్రణ చేయాలని, సంబంధిత అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. జమ్మలమడుగులో మంగళవారం 144 సెక్షన్ కొనసాగుతున్నా కూరగాయల మార్కెట్ వద్ద మాత్రం ట్రాఫిక్ అంతరాయంతో జనాలు ఉన్నప్పటికి చర్యలు లేవని తెలుస్తోంది.

'పోలీసుల నిర్లక్ష్యంతోనే ఘర్షణ'

బద్వేలు, మే 14: చెన్నకేశంపల్లె బూత్ వద్ద సోమవారం వైసీపీ, టీడీపీ నేతల మధ్య ఘర్షణకు కారణం పోలీసుల నిర్లక్ష్యమేనని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధ పేర్కొన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ఏజంట్ మల్లికార్జున రెడ్డిపై దాడిచేయడం అమానుషమన్నారు. అక్కడ ఘర్షణ పడు తున్నా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది ప్రేక్షక పాత్ర వహించడం సరైనది కాదన్నారు. శంకర్ రెడ్డిపై దాడిచేసిన వారిపై చట్టపర చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుడా ఛైర్మన్ గురు మోహన్, మున్సిపల్ ఛైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ సాయిక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అడ్డుకున్న పోలీసులు



పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న సీఐలు, ఎస్ఐలు, పోలీసులు

ముద్దనూరు మే14: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని మంగళవారం డీఎస్పీ యశ్వంత్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. భారీ ఎత్తున అనుచరులతో ముద్దనూరు చేరుకున్నారు. ఆయన ముద్దనూరులోని ఎమ్మెల్యే మేనమామ మునిరాజారెడ్డి ఇంటి వద్దకు రాగా భారీ ఎత్తున వాహనాలు, జనం వున్న విషయం తెలుసుకుని డీఎస్పీ ఆరాతీశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎమ్మెల్యే మేనమామ ఇంట్లోనే సుధీర్‌రెడ్డి ఉండిపోయారు. భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. పోలింగ్ రోజున జమ్మలమడుగులో జరిగిన ఘర్షణ దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యేని జమ్మలమడుగు వెళ్లకుండా అడ్డుకున్నట్లు పోలీసులు తెలిపారు.

రహదారికి అడ్డంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మరు

పోరుమామిళ్ల, మే 14: పోరుమామిళ్ల ప్రధాన రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. పోరుమామిళ్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్లు సిట్టింగ్ చేయడానికి దాదాపు కోటికి పైగా చెల్లించాల్సి ఉంది. రోడ్డు బిల్లులే లేకపోతే ఈ సిట్టింగ్ చార్జీలు ఎలా చెల్లించాలనే పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు ఉన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పోరుమామిళ్లలో వైద్యవిధాన పరిషత్ ఎదుట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు అడ్డంకే కాకుండా ప్రమాదకారిగా మారింది. గతంలో ఓ ఆల్విన్ డ్రైవరు వైఎస్ఆర్ విగ్రహం ఢీకొని నేరుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆగారు. ఆ సమయంలో రాళ్లు అడ్డంగా ఉండడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పట్లో కొన్నిగంటల పాటు విద్యుత్ అంతరాయం జరిగింది. రాత్రి సమయంలో కరెంటు పోవడంతో ఇది గమనించని వారు ప్రవదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిలో అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లుతొలగించి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

దారికి అడ్డంగా పడినా పట్టించుకోరా?



కాశినాయన, మే14: ఇటీవల కురిసిన గాలివానకు ఆకులనారాయణపల్లె నడిబొడ్డున ఉన్న కరెంట్ స్తంభం పడిపోయింది. దారికి అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ద్విచక్రవాహనాలు సైతం వెళ్లాలన్నా వీలుగాని పరిస్థితి నెలకొంది. స్తంభం పడిపోయి దాదాపు 10 రోజులవుతున్నా సంబంధిత అధికారులు సిబ్బంది పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాన్స్‌కో సిబ్బంది స్పందించి దారికి అడ్డంగా పడిన విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

వేడుకగా గంగ జయంత్యుత్సవాలు

రాజుపాలెం, మే 14: అర్కటవేములలో గంగా దేవత వేడుక ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఏటా ఈ ఆలయంలో గంగా జయంత్యుత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉదయం నుంచి గ్రామ దేవతకు అభిషేకాలు, కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు చేశారు.

బోర్లలోనీరు రాక ఎండిన అరటితోట

● లబోదిబోమంటున్న రైతన్నలు



నిట్టనిలువునా ఎండిపోయిన అరటితోట

ఖాజీపేట, మే 14: కేసీ కెనాల్‌కు నీరు ఈ ఏడాది సకాలంలో రాకపోవడంతో రైతులు పెట్టిన పంట చేతికందలేదు. ఖరీఫ్‌లో పంటలు దెబ్బతినడంతో అప్పులు మిగిలాయి. కనీసం రబీలోనైనా తిరిగి పంటలను రక్షించుకుని అప్పు తీర్చుకుందామనుకుంటే కేసీ కెనాల్‌కు నీరు రాక పెట్టిన పంటలు అరకొర దిగుబడితో చేతికి అందాయి. అరటి తోట మాత్రం రెండేళ్ల పంట కావడంతో నీరు లేక నిట్టనిలువునా ఎండిపోయింది. దీంతో రైతులకు అప్పులు మిగిలాయి. రెండు రోజుల కిందట కొద్దిపాటి వర్షం కురవడంతో తిరిగి రైతన్నల ఆశలు చిగురిస్తున్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడం, సకాలంలో వర్షాలు రాక ఏ పంటలను సాగు చేయాలో రైతన్నలకు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



ఆర్టీఓకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, మే 14: ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి సి.సుబ్బరాయుడు ఆర్టీఓ మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికలను అవకాశంగా తీకున్న ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు ప్రయాణికులను దోపిడీ చేశారని ఆరోపించారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల నుంచి ఆన్‌లైన్‌లో రూ.2,500 నుంచి రూ.4 వేల వరకు టిక్కెట్లను విక్రయించారని తెలిపారు. మరో రెండు వారాల్లో విద్యా సంస్థలు ప్రారంభం కానున్నాయని, ప్రైవేటు ట్రావెల్స్ దోపిడీకి పాల్పడకుండా రవాణాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నేతలు రవి, ప్రమీల పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి

ప్రొద్దుటూరు టౌన్, మే 14: భగీరథ మహర్షి జయంతి వేడుకలను సగర సంఘం కార్యాలయంలో నిర్వహించారు. భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల సమర్పించిన సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి మాట్లాడుతూ భగీరథ మహర్షి సగరుల ఆరాధ్య దైవమని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జారి వీరమోహన్, సంఘం నేతలు సీతంపల్లె రవి, పల్లపోలు అగ్గిరాముడు, కిరణ్, మజ్జారి శ్రీను, మజ్జారి లక్ష్మినారాయణ, వెంకటరమణ, సురేష్, విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.